క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండలంలోని నల్లమడుగు గ్రామస్తులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు. అంతకుముందు గ్రామంలోని బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు బుర్ర నారాగౌడ్, రామకృష్ణాగౌడ్, మహేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ గురుపూజ



రాజంపేట: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం ఆవరణలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి జరుపుకుంటున్న నేపథ్యంలో గురుపూజ నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథి మోహన్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని భారతమాతా చిత్రపటానికి పూజలు నిర్వహించారు. పిట్ల శ్రీను, గుర్రాల రాము, ప్రవీణ్, అవినాష్, లక్ష్మణ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బీసీసీ యూత్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్, జగన్నాథం, అధ్యక్షుడిగా పారునంది ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక ప్రసాద్, ఉప ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా వెంకట్‌రాజు, సలహాదారులుగా పిట్ల వేణు, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రాము, శ్రీధర్‌రావు, రాజు, వంశీ ఎన్నికయ్యారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి


నీళ్లు రాని కుళాయి

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రథంగల్లీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే నీరు రాకపోవడంతో గత మూడు రోజులుగా నీటి కోసం తంటాలు పడుతున్నట్లు పేర్కొన్నారు. అయినా తమ సమస్యను పట్టించుకునేవారు కరువయ్యారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌లో సమస్యలు ఉన్నాయని వాటిని గ్రామ పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థినులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు మోహన్‌నాయక్, నార్లరవీందర్, పిట్ల శ్రీధర్, ఎజాస్, అలీమోద్దీన్‌బాబ, కాసుల రోహిత్, మంజూర్, గౌస్, రాజు పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



బాన్సువాడ రూరల్: బాన్సువాడలో ఈనెల 27న నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాలసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్ కోరారు. బాన్సువాడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన సంఘ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మాలల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరవుతున్నారని తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన మాలలు అధిక సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు. నాయకులు మిర్జాపూర్ సాయన్న, మల్లూరు సాయిలు, గౌడి నర్సింలు, దండు భూమేష్, బాల సాయిలు, గైని ప్రవీణ్‌కుమార్, సైదయ్య పాల్గొన్నారు.




బాన్సువాడలో బోనం ఎత్తుకున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. ఎల్లారెడ్డిలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

వైభవంగా బోనాల పండుగ

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఆదివారం బోనాల పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లోని గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ఊరడమ్మ, మహంకాళి, దుర్గా మాతతోపాటు ఇతర దేవతలకు ఆషాడ మాసం సందర్భంగా బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో బోనాల ఊరేగింపును డీజే సౌండ్స్, డప్పుచప్పుళ్లు, శివసత్తుల విన్యాసాల నడుమ ఆలయాల వరకు కొనసాగించారు. అమ్మవార్లకు బోనాలను, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. బాన్సువాడలోని సంగమేశ్వర కాలనీ దుర్గామాత ఆలయం వద్దరాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దోమకొండలో మహంకాళి బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ దర్శించుకున్నారు.


బీబీపేటలోని మహంకాళి ఆలయం వద్ద బోనాలతో ప్రదక్షిణలు నిర్వహిస్తున్న భక్తులు


భిక్కనూరులో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


దుర్కిలో..


కామారెడ్డిలోని గాయత్రీ నగర్‌లో..


రాజంపేటలో..


ఉత్తునూర్‌లో..




కంభాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు.. దోమకొండలో షబ్బీర్ అలీని సన్మానిస్తున్న దృశ్యం.. బాన్సువాడలో పూజలు చేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి


బరంగెడ్గి గ్రామంలో..


మాల్తుమ్మెదలో..

పలు గ్రామాల్లో వన భోజనాలు


లింగంపేటలో వన భోజనాలు చేస్తున్న ప్రజలు


కామారెడ్డిలో గోరింటాకుతో మహిళలు

లింగంపేట/కామారెడ్డి అర్బన్/రామారెడ్డి: పలు గ్రామాల్లో ప్రజలు ఆదివారం ఆషాడమాసం సందర్భంగా వన భోజనాలకు వెళ్లారు. లింగంపేట, రామారెడ్డి, కామారెడ్డి మండలంలోని పలు గ్రామాల ప్రజలు వంటా–వార్పు చేసుకొని గ్రామాల శివారుల్లోని పచ్చిక బయళ్లకు వెళ్లి చెట్ల కింది వన భోజనాలు చేశారు. అంతకు ముందు వన దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాకేంద్రంలో పలువురు గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


దోంగ్లీలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


రామేశ్వర్‌పల్లిలో..

భిక్కనూరు/మద్నూర్(జుక్కల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో పలు మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచిపెట్టారు.

కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం భైరాపూర్ గ్రామంలో ఆదివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు 'భారత రాజ్యాంగ పరిరక్షణ, బహుజన అలయ్‌బలయ్' కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. కామారెడ్డిలోని కళాభారతిలో ఈనెల 27న నిర్వహించనున్న భారత రాజ్యాంగ పరిరక్షణ, బహుజన అలయ్‌బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రవి, చిన్న సాయిలు, రాజు, సురేష్, లక్ష్మణ్, సతీష్, విఠల్, కిష్టయ్య, సాయవ్వ, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెల్లకుంట తండాకు చెందిన లకావత్ దేవిచంద్ భార్య సునీత గతంలో రోడ్డుప్రమాదంలో మృతి చెందింది. మృతురాలు మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉండటంతోపాటు, బీమా ఉండటంతో బీమా డబ్బులు మంజూరయ్యాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మహిళాసంఘం ద్వారా మంజూరైన రూ.10లక్షల బీమా చెక్కును, పొదుపు సంఘం నుంచి రూ.లక్షా50వేల చెక్కును దేవిచంద్‌కు అందజేశారు. ఐకేపీ సీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వసూరాం, వర్జ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నేటి చిత్రం


మాడ్రన్ కాలనీకి సమీపంలో రోడ్డు పక్కన మురుగునీరు

మురుగునీటిని తొలగించాలి

రామారెడ్డి: మండల కేంద్రం మోడ్రన్ కాలనీ సమీపంలో రామారెడ్డి– కామారెడ్డి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన భారీ గుంతలో మురికి నీరు నిల్వ ఉంది. దీంతో దోమల బెడద నెలకొంది. అధికారులు స్పందించి మురికి నీరును తొలగించాలి.

– రాజయ్య, రామారెడ్డి

మాకు ఫోటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

బీసీల రాజకీయ ఎదుగుదల కోసమే 42శాతం రిజర్వేషన్లు


దోమకొండలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ


భాగిర్తిపల్లిలో మొక్కను నాటి నీరు పోస్తున్న షబ్బీర్‌అలీ

దోమకొండ/భిక్కనూరు: రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగిన వెనుకబడిన తరగతుల కులాలు రాజకీయంగా ఎదగడానికే రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. దోమకొండలోని విజయ పాలశీతలీకరణ కేంద్రంను ఆదివారం ఆయన పునఃప్రారంభించి మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీ రిజర్వేషన్లపై వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. దీనిపై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలపై ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. భిక్కనూరు మండలం భాగీర్తిపల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలను నాటారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, ఐరేని నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, భీంరెడ్డి, సుతారి రమేష్, నాయకులు తాటిపల్లి శ్రీకాంత్, అబ్రబోయిన స్వామి, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, సీతారామ, మధు, సంతోష్ కుమార్, నర్సింలు, స్వామి, సుదాకర్, నరేష్ భాగయ్య, నల్లపు శ్రీనివాస్, పల్లె రామస్వామి గౌడ్, డివిజన్ అటవీశాఖాధికారి రామకృష్ణ, రేంజ్ అధికారి రమేష్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా శ్రీవారి శ్రవణ నక్షత్ర కల్యాణం



నస్రుల్లాబాద్(బీర్కూర్): మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి వారికి శ్రవణ నక్షత్ర కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, లక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అభివృద్ధికి నోచుకోని ఆలయాలు


గణేష్ మందిరంలోకి వచ్చిన మేకలు

బిచ్కుంద(జుక్కల్): పట్టణంలోని పురాతన రామ మందిరం, సార్వజనిక్ గణేష్ మందిరం దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్నా, అభివృద్ధికి నోచుకోవడం లేదు. గణేష్ మందిరం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎలాంటి రక్షణ లేక మందిరంలోకి పశువులు వచ్చి అపవిత్రం చేస్తున్నాయి.దూపదీప పథకం కింద అర్చకుడుకి ప్రతి నెల రూ.6వేలు వేతనం ఉంది. దేవదాయ శాఖ ఈవో శ్రీధర్ వేతనంలో కోత విధిస్తునట్లు తెలిసింది. అలాగే ఆలయానికి చెందిన భూమి కబ్జాకు గురైనా అధికారులు స్పందించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఆలయ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం తుమ్మల్ల శివారులో వ్యవసాయ బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే స్తంభాలు ఓ పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఒకే లైన్‌లో రెండు మూడు స్తంభాలు వంగిపోయి ఉన్నాయి. గాలులు వీస్తే ఎప్పుడు పడిపోతాయో అని స్థానిక రైతులు భయపడుతున్నారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


గాంధారిలోని పొలాల వద్ద వంగిపోయిన స్తంభం

సూచిక బోర్డు ఏర్పాటు చేయరూ!


శివాయిపల్లి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

రాజంపేట: రాజంపేట నుంచి శివాయిపల్లి, తలమడ్ల గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఆయా మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు గమనించకుండ ప్రమాదాల బారినపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: మండల కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో నాన్ మైనారిటీ విద్యార్థులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మహమ్మద్ రఫత్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతిలో బీసీ కేటగిరీలో ఒక్కో సీటు, 9వ తరగతిలో ఎస్సీ, ఓసీ కేటగిరిలో ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమాచారం..

నేడు విద్యుత్ శాఖ ప్రజావాణి

ఎల్లారెడ్డి: పట్టణంలోని విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయంలో సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలను ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

సంక్షిప్తం

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి ఆవరణలో మొక్కను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్టియన్లకు తగిన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాయకులు సుజిత్, సురేందర్, చర్చి ఫాదర్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో ర్యాంపు నిర్మాణం

ఎల్లారెడ్డి: పట్టణంలోని 7వ వార్డులో సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ తన సొంత నిధులతో ర్యాంపు నిర్మించినట్లు కాలనీవాసులు ఆదివారం తెలిపారు. కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వైస్ చైర్మన్‌ను కోరడంతో ఆయన తన సొంత నిధులతో ర్యాంపు నిర్మించినట్లు తెలిపారు.ప్రశాంత్‌గౌడ్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎల్లారెడ్డిరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై మహేష్ అన్నారు. ఎల్లారెడ్డిలో ఆదివారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని అన్నారు. పెండింగ్ చలాన్లు లేకుండా చూసుకోవాలని అన్నారు.

మసీదు అభివృద్ధికి సహకరించాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని ఉస్మానియా మసీదు అభివృద్ధికి సహకరించాలని మైనార్టీ నాయకులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మసీదు ఆవరణలో సీసీ రోడ్డుతోపాటు, సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణం చేయాలని, కమ్యూనిటీ హాల్‌కు నిధులను కేటాయించాలని వారు విన్నవించారు. నాయకులు ఆరీఫ్, గఫార్, ఇంతియాజ్, అజహర్, రఫీక్ తదితరులున్నారు.

ఎస్సైకి సన్మానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పుష్పరాజ్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. నాయకులు బొంబోతుల లింగాగౌడ్, మద్దెల బాగయ్య, సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్సై దీపక్‌కుమార్, ఏఎస్సై మధుసూధన్‌ను ఆదివారం టీడీపీ నాయకులు కలిసి సన్మానించారు. నాయకులు దేమె కమ్మరి రాజు, విశ్వేశ్వర్ శర్మ, నన్యానాయక్, బండ్ల సాయిలు, కమ్మరి కృష్ణ, జగ్యానాయక్, తిరుమల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాన్సువాడ రూరల్: బాన్సువాడ రూరల్ సీఐగా తిరుపతయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కామారెడ్డి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై బాన్సువాడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన రాజేష్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా కొత్త సీఐ తిరుపతయ్య మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.